క్లుప్తంగా

రాజరాజేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి గ్రామంలో రాజరాజేశ్వరీదేవి అమ్మవారి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు దూసి శ్రీధర్ శర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పెద్దఎత్తున భక్తులు తరలి వచ్చి అమ్మవారికి కుంకుమాభిషేకాలు, పంచామృతాభిషేకాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

గజపతినగరంలో 'ఫ్యామిలీ డాక్టర్'



వైద్యసేవలందిస్తున్న డాక్టర్ సుష్మ

గజపతినగరం: స్థానిక గ్రామ సచివాలయం -1 పరిధిలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ ఆధ్వర్యంలో మంగళవారం' ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. సచివాలయంలో ముందుగా ఓపీ (అవుట్ పేషెంట్) సేవలు అందించారు. 126 మందికి వైద్య సిబ్బంది వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం గృహసందర్శన చేసి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వైద్య తనిఖీలు చేశారు.

హౌసింగ్ ఏఈగా రాజ్‌గోపాల్



రాజ్‌గోపాల్

గంట్యాడ: గృహ నిర్మాణశాఖ ఏఈగా కె.రాజ్‌గోపాల్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రాజాం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఏఈగా పనిచేసిన మోహన్‌రావుకు రేగిడి ఆముదాలవలసకు బదిలీ అయింది. ఏఈ రాజ్‌గోపాల్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల వేగవంతానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు.


రీసర్వే పనుల పరిశీలన



రీసర్వే పనులను పరిశీలిస్తున్న జేసీ మయూర్ అశోక్

శృంగవరపుకోట: మండలంలోని పెదఖండేపల్లి గ్రామంలో సమగ్ర భూరీసర్వే పనులను జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్‌అశోక్ మంగళవారం పరిశీలించారు. సర్వే సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. అనంతరం ధర్మవరం గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. గ్రామంలో సర్వే పనులపై సిబ్బందిని ఆరా తీశారు. అలాగే వేములాపల్లి గ్రామంలో పౌరసరఫరాల గోడౌన్‌కు సంబంధించి సర్వే నంబర్ 78/5లో 2.50 ఎకరాల భూమిని పరిశీలించారు. భూమికి సంబంధించి తహసీల్దార్‌ను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

చీపురుపల్లి: పట్టణంలోని కొత్తగవిడివీధి గీతా మందిరంలో శ్రీ మద్భగవద్గీతపై సోమవారం సాయంత్రం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేసి, అభినందించారు.

ఆలయానికి వాటర్ ప్లాంట్ వితరణ



ఆలయానికి వాటర్‌ప్లాంట్‌ను ఇస్తున్న సూర్యారావు కుటుంబీకులు

శృంగవరపుకోట: కొట్టాం గ్రామదేవత కోట మ్మతల్లి ఆలయానికి స్థానిక భారతీయ జనతాపార్టీ సీనియర్ నాయకులు దొడ్డి సూర్యారావు తన కుటుంబ సభ్యులతో కలిసి రూ.45,000 విలువ గల వాటర్‌ప్లాంట్‌ను ఆలయ ఈఓకు మంగళవారం అందజేశారు. అనంతరం ప్లాంటును దాత ప్రారంభించి భక్తులకు మంచినీరు అందించారు. ఆలయ పరిసరాలు బాగుచేసి మొక్కలు నాటారు. కోటమ్మ వారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం వాటర్‌ప్లాంట్ ఇచ్చామని దాతలు ప్రాస్పారు.

నవరత్న పథకాలతో పేదల అభ్యున్నతి



కొత్తవలస: మహిళకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

● 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి

కొత్తవలస: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించి అమలు చేస్తున్న నవరత్న పథకాలు పేదల ఆర్థికాభివృద్ధికి, అభ్యున్నతికి ఎంతో దోహద పడుతున్నాయని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని దేశపాత్రునిపాలెం గ్రామంలో మంగళవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలను అమలు చేస్తున్నారన్నారు. సమ సమాజ స్థాపనకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆదిశగానే సంక్షేమం,అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అవినీతికి తావులేకుండా, కుల, మతం, పార్టీ అనే తేడా లేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలను అందిస్తున్నామని, జగన్‌మోహన్‌రెడ్డి పదికాలాల పాటు సీఎంగా ఉండాల్సిన అవరం ఎంతైనా ఉందన్నారు.



చీపురుపల్లిరూరల్: లబ్ధిదారులకు సీఎం జగన్ సందేశపత్రాన్ని అందజేస్తున్న ఎంపీపీ వెంకటనరసమ్మ, నాయకులు

చంద్రబాబు ఓ ఊసరవెల్లి

వైఎస్సార్‌సీపీపై ఎత్తులు, కుయిత్తులు పన్నేందుకు ప్రతిపక్షనేత చంద్రబాబు ఎక్కని గడప లేదు, తొక్కని ప్రాంతం లేదని ఎమ్మె ల్యే కడుబండి ఎద్దేవా చేశారు. ఊసరవెల్లి రంగులు మార్చినట్లు ప్రతీ ఎన్నికలకు చంద్రబాబు రంగులు మారుస్తారని, ప్రాంతం, సిద్ధాంతాలతో పనిలేకుండా పొత్తులకు ఎగబాకి ఆంధ్రుల పరువు తీస్తున్నారని దుయ్యబట్టారు. రానున్న ఎన్నికలే తెలుగుదేశం పార్టీకి చివరివని అన్నారు. కార్యక్రమంలో కొత్తవలస పీఏసీఎస్ చైర్మన్ గొరపల్లి శివ, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి బొంతల వెంకటరావు, నాయకులు దలాయి అప్పలరాజు, ఏడువాక నారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

చీపురుపల్లిరూరల్: రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ అన్నారు. పెదనడిపల్లి గ్రామంలో మంగళవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. అధికారులు, నాయకులతో కలిసి ఎంపీపీ ఇంటింటికి వెళ్లి పథకాలను ప్రజలకు వివరించి, ఆయా పథకాలు అందుతున్నాయా లేదా, సచివాల య సిబ్బంది, వలంటీర్ల సేవల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనకు మధ్య తేడాలను వివరించారు. ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు పిసిని శ్రీనివాసరావు, సర్పంచ్ పాలరాజు, ఎంపీటీసీ ఆదినారాయణ, పలుశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులందరికీ సీసీఆర్‌సీలు



బొండపల్లి: నెలివాడలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న ఏఓ మల్లికార్జునరావు



లక్కవరపుకోట: కల్లేపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ స్వాతికుమారి

బొండపల్లి: గ్రామాల్లో అర్హత కలిగిన ప్రతీ కౌలు రైతుకు కౌలు గుర్తింపు కార్డులు (సీసీఆర్‌సీ - క్రాప్ కల్టివేటెడ్ రైట్ కార్డు) అందజేయనున్నట్లు ఏఓ పి.వి.మల్లికార్జునరావు తెలిపారు. మండలంలోని అంబటివలస, నెలివాడ సచివాలయాల పరిధిలో కౌలు రైతుల గుర్తింపునకు సంబంధించి గ్రామసభలను మంగళవారం నిర్వహించారు. అర్హులకు గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డు ఉన్న రైతులు రైతుభరోసాతో పాటు, బ్యాంకుల నుంచి వ్యవసాయ రుణాలు, ప్రభుత్వం కల్పించే ఇతర సదుపాయాలు, పంట నష్ట పరిహారం పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు తమ ఆధార్ కార్డుతో రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఏఈఓ సంతోష్‌కుమార్, వీవీఏలు, అంబటివలస ఎంపీటీసీ తాళ్లపూడి అప్పలనాయుడు, నెలివాడ సర్పంచ్ తాళ్లపూడి కీర్తి, నాయకులు తాళ్లపూడి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కౌలు గుర్తింపు కార్డులు తప్పనిసరి

లక్కవరపుకోట: కౌలుకు భూములను సాగు చేసే రైతులంతా తప్పనిసరిగా గుర్తింపు కార్డులు పొందాలని ఏఓ స్వాతికుమారి తెలిపారు. మండలంలోని కల్లేపల్లి గ్రామంలో రైతులకు ఖరీఫ్ సాగు ప్రణాళికలపై మంగళవారం అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డులు కావాల్సిన రైతులు వీఆర్‌ఓను సంప్రదిస్తే సమకూర్చుతారని చెప్పారు.మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు చేస్తున్నామని, వాటిఫలితాల ఆధారంగా ఆయా నేలలు ఏ పంటలకు అనుకూలమో వాటినే సాగు చేసు కుంటే మంచిదిగుబడులు వస్తాయని చెప్పారు. పచ్చిరొట్ట,చిరుధాన్యాల విత్తనాలను రాయితీపై రైతుభరోసా కేంద్రాల ద్వారా అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే వరి విత్తనాల కోసం ఆర్బీకేల్లో నమోదు చేసుకున్న రైతులకు రాయితీపై విత్తనాలు పంపిణీ చేస్తున్నామని వివరించారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎరువులు,పురుగు మందులను ఆర్బీకేల్లో సిద్ధం చేస్తున్నామని తెలిపారు. వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ సారథి జగన్‌ను ఆశీర్వదించండి



పథకాలను వివరిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎంపీ చంద్రశేఖర్

● జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన

గుర్ల: పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కోరారు. మండలంలోని పెనుబర్తిలో మంగళవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్ర మం నిర్వహించారు. జెడ్పీ చైర్మన్, ఎంపీకి స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో జెడ్పీ చైర్మన్ మాట్లా డుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల ప్రభుత్వమన్నారు. వివిధ పథకాల రూపంలో పెనుబర్తి గ్రామ ప్రజల ఖాతాల్లో గడిచిన నాలుగేళ్లలో సుమారు రూ.10.50 కోట్లను జమ చేశామని చెప్పారు. గ్రామంలో ప్రధాన రహదారిని రూ.25 లక్షలతో బీటీ రోడ్డుగా అభివృద్ధి చేశామని చెప్పారు. టీడీపీ హయాం పథకాలు, ఇళ్ల కోసం జన్మభూమి కమిటీలు, టీడీపీ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులను వెతుక్కుంటూ పథకాలు ఇంటి వద్దకే వలంటీర్ల ద్వారా వస్తున్నాయని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసం గమనించాలని ప్రజలను కోరారు. ఎంపీ బెల్లాన మాట్లాడుతూ నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరిస్తున్నామని చెప్పారు. త్వరలో అమ్మఒడి పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు పథకాలను వివరించారు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, సర్పంచ్ తుమ్మగుంటి మాధవి, ఎంపీడీఓ కల్యాణి, తహసీల్దార్ సూర్యనారాయణ. వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, తోట తిరుపతిరావు, అంబల్ల లక్ష్మి, పరమేష్, అచ్యుత్, చిన్నారావు పాల్గొన్నారు.

క్రీడాకారులకు నగదు ప్రోత్సాహం



విద్యార్థులను అభినందిస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి, దంపతులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కొండలక్ష్మీపురం గ్రామానికి చెందిన క్రీడాకారిణులు పి.రేణుక, ఆర్.మౌనిక, ఎం.ప్రవళిక సౌత్‌జోన్ టెన్నీకాయిట్ పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈనెల 4వ తేదీన జరిగిన 25వ సౌత్‌జోన్ టెన్నీకాయిట్ నేషనల్ సెలక్షన్స్‌లో రాణించి 16,17,18 తేదీల్లో చెన్నైలో నిర్వహించే పోటీలకు అర్హత సాధించారు. వీరిని ఎంపీపీ మీసాల విజయలక్ష్మి, మీసాల విశ్వేశ్వరరావు దంపతులు మంగళవారం అభినందిస్తూ రూ. 5వేల నగదు ప్రోత్సాహం అందజేశారు. వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములనాయుడు, కోచ్‌లు ఎం.రామారావు,బి.తిరుమలరావు పాల్గొన్నారు.

11న మోడల్‌స్కూల్ ప్రవేశపరీక్ష

మెరకముడిదాం: గర్భాం ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశాలకు ఈనెల 11న అదే స్కూల్ కేంద్రంగా పరీక్ష నిర్వహించ నున్నట్లు ప్రిన్సిపాల్ డి.వి.ఎస్.అరుణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇది వరకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ హాల్ టికెట్లను ఏపీఎంఎస్.ఏపీసీ ఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి 12 గంటలకు పరీక్ష ఉంటుందని, విద్యార్థులంతా సమయానికి పరీక్ష కేంద్రంలో హాజరు కావాలని సూచించారు.

ద్విచక్రవాహనాల వేలం రేపు

గజపతినగరం: మద్యం కేసుల్లో సీజ్ చేసిన బైకులకు ఈనెల 8వ తేదీన గజపతినగరం పోలీస్ స్టేషన్ ఆవరణలో వేలం వేయనున్నామని ఎస్ఐ గంగరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు గురువారం నిర్వహించే వేలం పాటలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

దత్తిరాజేరు: మద్యం కేసులో సీజ్ చేసిన టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనానికి గజపతినగరం సర్కిల్ కార్యాలయంలో మంగళవారం వేలం పాట వేయనున్నట్లు ఎస్ఐ జి శిరీష మంగళవారం తెలిపారు. ఆసక్తి గల వారు గురువారం ఉదయం 11 గంటలకు సర్కిల్ కార్యాలయంలో హాజరు కావాలని కోరారు.

దేవుపల్లి సచివాలయ భవనం ప్రారంభం రేపు

బొండపల్లి: దేవుపల్లి గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని కోరారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు

బొండపల్లి: గ్రామాల్లో ఎవరైనా బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా గజపతినగరం ఎస్ఈబీ అధికారులు దాడులు చేసి పట్టుకున్న వారిని తహసీల్దార్ ముందు మంగళవారం హాజరు పరిచారు. తహసీల్దార్ వారితో మాట్లాడుతూ మరొకసారి మద్యం విక్రయిస్తూ పట్టుబడితే భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఎస్ఈబీ ఎస్ఐ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

హైవే పక్కన వాహనాలు నిలపవద్దు

బొండపల్లి: స్థానిక జాతీయ రహదారి-26కు ఇరువైపులా ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలిపితే చర్యలు తప్పవని ఎస్ఐ ఎస్.రవి వాహన చోదకులను హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హైవేలో వాహనాలు నిలిపాల్సి వస్తే రహదారికి దూరంగా ప్రమాదాలు జరగని ప్రదేశాల్లో మాత్రమే నిలపాలని సూచించారు. అలా కాకుండా వాహనాలను నచ్చినట్టు ఎక్కడ పడితే అక్కడ నిలిపితే మాత్రం చర్యలు తప్పవన్నారు.

అటవీశాఖ భూములపై గ్రామసభ



గ్రామసభలో మాట్లాడుతున్న డీఎఫ్‌ఓ

శృంగవరపుకోట: మండలంలోని పెదఖండేపల్లి గ్రామంలో రెవెన్యూ,, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా సర్పంచ్ యాళ్ల వెంకటరమణ, ఎంపీటీసీ బోదల దేముడు సమక్షంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. రెవెన్యూ అధికారులు అటవీశాఖకు అప్పగించిన భూములకు సంబంధించి గ్రామస్తుల నుంచి అభిప్రాయసేకరణ చేశారు. డీఎఫ్‌ఓ వెంకటేష్ ,తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు రైతుల అభిప్రాయాలు వారి సాదక బాధలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల అభిప్రాయాలను జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

నేత్ర, అవయవదానానికి అంగీకారం



గోవిందరాజులకు అంగీకార పత్రాలను అందజేస్తున్న వేతనదారులు

చీపురుపల్లి రూరల్: మండలంలోని అలజంగి గ్రామానికి చెందిన 250 మంది నేత్ర, అవయవ దానినికి అంగీకారం తెలిపారు. చీపురుపల్లికి చెందిన మానవీయత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బి.వి.గోవిందరాజులు గ్రామంలో ఉపాధి పనుల వద్దకు వెళ్లి నేత్ర, అవయవదాన ఆవశ్యకతపై మంగళవారం అవగాహన కల్పించారు. గోవిందరాజులు మాట్లాడుతూ మరణాంతరం నేత్ర,అవయవాలు మట్టిలో కలిసిపోకుండా వేరొకరికి ఉపయోగపడి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు అవయవ దానానికి ముందుకు రావాలని కోరారు. అనంతరం 250 మంది నేత్ర,అవయవదానానికి అంగీకారం తెలుపుతూ హామీ పత్రాలపై సంతకాలు చేసి అందజేశారు.

పరిశుభ్రత పాటిద్దాం..

మలేరియాను తరిమేద్దాం




వియ్యంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కొత్తవలస: పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని, తద్వారా మలేరియాను నియంత్రించవచ్చని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యులు గోపాలకృష్ణ, సింహాద్రినాయుడు అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా వియ్యంపేట గ్రామంలో వైద్య సిబ్బంది మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమల వ్యాప్తిని అరికడదాం..ప్రజారోగ్యాన్ని పరిరక్షించుకుందాం అంటూ సిబ్బంది నినాదాలు చేశారు. వైద్యులు మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో దోమల వ్యాప్తి అధికంగా ఉంటుందని, మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. నివాసాల మధ్య మురుగు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, వీధుల్లో ఇంటి పరిసరాల్లో కొబ్బరి బొండాల చిప్పలు, వాడి పడేసిన టైర్లు లేకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. వైద్య సిబ్బంది జగదాంబ,నర్సింహరావు, సత్యారావు, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

బొండపల్లి: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని గజపతినగరం నియోజకవర్గ బీజేపీ నాయకుడు దేవర ఈశ్వరరావు అన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టి 9 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మండలంలోని రయింద్రాం గ్రామంలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ గ్రామానికి వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, చేపడుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సీతంలో 'వరల్డ్ పెస్ట్ అవేర్‌నెస్ డే'



సీఎంఓ ప్రకాశరావును సత్కరిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు

విజయనగరం అర్బన్: 'వరల్డ్ పెస్ట్ అవేర్‌నెస్ డే' పురస్కరించుకొని గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరయిన విశాఖకు చెందిన పెస్ట్ క్యూర్ సొల్యూషన్స్, డీకేఎస్ ప్యాలెట్స్ అండ్ ఫర్నీచర్ ప్రైవేటు సంస్థల సీఎంఓ ప్రకాశరావు మాట్లాడుతూ చెద నియంత్రణ మానవ జీవనానికి కీలకమని అన్నారు. మానవులకు కీటకాల వల్ల కలిగే వివిధ సమస్యలు, ఆందోళనలను గూర్చి వివరించారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ముఖ్యఅతిథిని యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామమూర్తి, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జి.రవికిషోర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారథులు



దత్తిరాజేరు ; గడసాంలో వలంటీర్లను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



గంట్యాడ: కొర్లాంలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ హైమావతి

దత్తిరాజేరు: గ్రామ వలంటీర్లు ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారథులని వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్ అన్నారు. 'వలంటీర్లకు వందనం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని గడసాం సచివాలయంలో ఆ సచివాలయ పరిధి వలంటీర్లను మంగళవారం సత్కరించారు. ఈఓపీఆర్డీ వాణిశ్రీ, వైఎస్సార్‌సీపీ నాయకులు నేతేటి వెంకటరమణ, మజ్జి అప్పలనాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

గంట్యాడ: వలంటీర్లు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీపీ పీరుబండి హైమావతి పేర్కొన్నారు. మండలంలోని కొర్లాం గ్రామంలో వలంటీర్లను మంగళవారం సన్మానించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వలంటీర్లు తమ పరిధిలోని కుటుంబాల్లో అర్హులందరికీ పథకాలు అందేలి చూడాలని ఆదేశించారు. సర్పంచ్ చప్ప వెంకటరమణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు కరక శ్రీను, చప్ప చిన్న, కోళ్ల కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాద మృతులకు సంతాపం



రైలు ప్రమాద మృతులకు సంతాపం తెలుపుతున్న సభ్యులు

విజయనగరం: ఒడిశాలోని బాలాసోర్ రైలు ప్రమాదం దేశ చరిత్రలో అత్యంత విషాదకరమైన దుర్ఘటన అని మానవ హక్కుల సంరక్షణ సంస్థ జిల్లా మహిళా అధ్యక్షురాలు పెంటపాటి రుక్మిణి పేర్కొన్నారు. పట్టణంలోని మూడు కోవెల సమీపంలో మానవ హక్కుల సంరక్షణ సంస్థ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బాలాసోర్ ప్రమాదంలో మృతి చెందిన వారికి కొవ్వొత్తులతో సంతాపం తెలిపారు. సంస్థ నేషనల్ చైర్మన్ రాజాన ప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి వై.కిషోర్, కార్యదర్శి కె.వి.రమణమూర్తి, నేషనల్ మీడియా సెక్రటరీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.